యనే స్వతంత్ర భావనకూ మనమానందించవలసిందే. "రంజితపాణి పల్లవము రాయుమనా" అనే పాపయ్యశాస్త్రిగారి ఘంటసాల గానాన్ని పదేపదే ఆలపించే విద్యార్థికి ఈ ముదురుమాటలు పుట్టుటలో వింతలేదు. ఈ సుందోప సుందుల కథలో మరియొక విచిత్రం చెబుతాను. సుందోప సుందులు వనమధ్యమున తిలోత్తమను "కనియక్కామినీమణి విలాసముల కచ్చెరు వొందె" అని యున్నది. కర్మకాలి "విలాస" అనే పదములో "లా" సరిగా అచ్చుకాలేదు. "మీసముల" అని విద్యార్థులు చదువుకున్నారు. తిలోత్తమకు మీసాలేమిటి? అనే సందేహము 100కి 50 మందివిద్యార్థులకు తోచనేలేదు. ఆ రాక్షసులామె మీసముల కాశ్చర్యపడిరి అనే వ్రాశారన్నమాట. కృష్ణునికి మీసాలున్నాయా? అనేది పెద్దలలో చాలా తుఫానులు లేపగా ఈనాడు "తిలోత్తమ మీసాలు" సమస్య అయినాయి...

"పోరిపోరి యొక్క పూపున నిద్దఱు
నొకసారి గదల నిక్కివేయ"

అనే పద్యపాదంపై మీసాలకు పదును పెట్టేటట్టు చాలమంది అన్వయించి సర్దాగా వివరణ వ్రాయడంలో విద్యార్థులు చూపిన ఉత్సాహాన్ని వ్రాయలేము. పూపు-నిక్కివేయ, అనే పదాలు తిలోత్తమ సుందోపసుందుల నాకర్షించినట్లే విద్యార్థుల నాకర్షించాయి.

ప్రశ్నలకు సరియైన సమాధానాలు వ్రాయడంలో నేటి విద్యార్థులు చూపించే విధానాలు పరిశీలిస్తే విద్యను సంస్కరించాలని కృషిచేసే నేటి పెద్దలకు ఉత్తమమార్గాలు ద్యోతకమవుతాయని హెచ్చరిస్తూ త్వరగా ఉత్తమవిద్య ప్రసాదింపబడే విధానం నవ్యాంధ్రరాష్ట్రంలో ప్రసాదింపబడుతుందని ఆశిస్తున్నాను.

---

కథానిక

# వ్యర్థంలో అర్థోదయం

"శార్వరి"

ప్రతివారూ "ఉద్యోగం పురుషలక్షణం" అని అంటూరు అలాగని నే నెప్పుడూ అనుకోలేదు. కాని నాకున్న ఆశయాలు బహుకొద్ది. ఆశయాలు లేకుండా మనుషులు బ్రతకగలరో లేదో కూడా నాకు తెలియనివిషయాల్లో ఒకటి. ఆ విషయాన్ని గురించి నే నెన్నడూ తీవ్రంగాఆలోచించలేదు. అసలు ఆలోచించే అవకాశం వ్యవధి, నాకు ఏర్పడలేదు. ఎందువల్లనంటే మనిషిఆలోచించటం ఆశయాల్ని గురించి యోచించటం పనిలేనప్పుడు విశ్రాంతిగా వున్నప్పుడు జరుగుతుంది. ఉద్యోగం, సద్యోగం లేనప్పుడే ఆలోచనలు విపరీతంగా కలుగుతాయి. నాకు ఏ విషయాన్ని గురించి ఆలోచించే తీరికా లేదు.

ఉద్యోగంలోచేరి కొన్ని సంవత్సరాలయింది. గవర్నమెంటు నౌకరీ కాదు, బడిపంతులు వుద్యోగమూ కాదు నాది. వ్యాపారసంస్థలో ఒక గుమాస్తాని నేను. ఇన్ని సంవత్సరాలు ఉద్యోగం చేసినతరవాత ఒక్కసారి వెనక్కుతిరిగి చూచుకుంటే ఏమీ అవుపించటంలేదు. నే సంపాదించింది ఏముంది? డబ్బు, కీర్తి, గౌరవం ఈ మాటలో ఏదీ నే సాధించలేకపొయ్యాను. పెద్ద ఉద్యోగం అయితే నాది, అలానే సంపాదించి వుండేవాణ్ణి కాని గుమాస్తానిగా నేను. అందులోనూ సామాన్య గుమాస్తాని.

కొంతకాలం నన్ను గురించి ఆలోచించుకోవటమే మర్చిపోయాను. అనవసరం అప్రస్తుతం అనుకొని. గతాన్ని గురించి ఆలోచించుకుంటే దిగులు, విచారం తప్ప ఏం మిగులుతాయి? నేను సాధించింది ఏమీలేదు. ఎవరికీ ఏ ఉపకారమూ చేసి ఎరగను. వ్యర్థంగా జీవిస్తున్నందుకు ఇప్పుడు విచారం కలుగుతోంది. ఇప్పుడు చేయగలిగింది మాత్రం ఏముంది?

ఒకసారి మా ఆవిడతో అన్నాను.

"నేను వ్యర్థజీవిని అనుకుంటున్నాను, నీ అభిప్రాయం ఏమిటి?" అని.

"అయితేమాత్రం ఏమిటి నష్టం" అని తుడిచి వేసింది.

"అదిగాదు. నే నెప్పుడైనా, ఎవరికైనా, ఏదైనా ఉపకారం చేసివుంటేనా అని నా అనుమానం" అన్నాను.

"చేసివుండకపోవచ్చు. లోకంలో అందరూ ఉపకారాలు చేస్తోవుంటే చేయించుకునేందుకు ఎవరు మిగులుతారు గనక. మీరేం విచారించకండి, మీకు మీరు ఉపకారం చేసుకుంటే లోకానికి చేసినంత పుణ్యం" అని అన్నది.

అంటే నాకు నేనే మంచి చేసుకోలేని అసమర్థుణ్ణి అని మా ఆవిడ తాత్పర్యం. అలా మొఖాన పట్టుకుని "నువ్వు వెధవ్వు, చేతకానివాడివి, అసమర్థుడివి" అని డొంకతిరుగుడు పదాలతో తిట్టే పెళ్ళాన్ని యింకేం సలహా అడగను? అసలు పెళ్ళాలంతా యింతే. మొగుణ్ణి తిట్టాలి అంటే మహా అందమైన పదాలతో తిడతారు, మహా తమాషాగా తిడతారు. ఎంతతిట్టినా సొంత పెళ్ళాం గనక ఏమీ అనలేక, అంటే కొట్టగలను తిట్టగలను, వూరుకున్నాను... కొట్టటాల్లో, తిట్టటాల్లో, భర్తలు చాలామంది మహాసమర్థులు.

నాకు కలిగిన అనుమానం ఎవరిముందు ప్రశ్నించ దలుచుకోలేదు! ఒంటరిగా కూర్చుని నాకై నేను ఆలోచించుకుంటే నష్టం ఏమిటిగనక? నేను వ్యర్థుణ్ణి. ఎవరికీ మంచి చెయ్యలేను. చదువుకున్నాను. చాలామందికన్న ఎక్కువగా నే చదువుకున్నాను. నా చదువు ఇంతకన్న పెద్ద వుద్యోగం రావాల్సిందే. కాని రావపోవటం నా తప్పని నేననుకోను పై ఉద్యోగుల తప్పు అని వాళ్ళు వొప్పుకోకపోతే వాళ్ళ ఖర్మ వాళ్లు అనుభవిస్తారు. పెద్దఉద్యోగం ఇస్తే నే కాదన్నానా?

మంచివాళ్ళకి రోజులులేవు అంటారు అందుకనే, నాకు మంచిరోజులు లేవుగనక నేను మంచి వాణ్ణి. వసుధా మంచివాణ్ణనే అంటారు చాలా మంది. తాగుడు అలవాటు లేనికారణంగా, సిగరెట్ అలవాటు లేనికారణంగా, చీట్లపేక ఆడని కారణంగా, గుర్రప్పందాలు, పజిల్సు, బ్రాకెట్లు ఇత్యాదుల్ని అసహ్యించుకునే కారణంగా కొందరి దృష్టిలో మంచివాణ్ణి కాకపోవచ్చు! కాని మా ఆవిడను అడిగితే తెలుస్తుంది నేనెంత మంచివాణ్ణో! కనీసం మా జీవితంలో ఒక్కమారన్న పోట్లాడుకుని ఎరగం! కోప్పడే ఎరుగనుగదా! మా యిరుగమ్మపొరుగమ్మ ఎంతగా విచారిస్తారో (యితరులకేం తెలుసు) నాలాంటి మొగుడు దొరకనందుకు. ఆడవాళ్ళని ఆకర్షించే తెలివితేటలుతప్ప పై ఉద్యోగుల్ని మెప్పించే తాహతులోలేనిమాట వాస్తవం. ఆ తెలివితేటలే వుంటే బాగుపడేవాణ్ణి. చిన్న విషయాల్లో సైతం మాటలు అనిపించుకోవాల్సినగతి నా కేంపట్టె? ఇంతకాలం అంకెలు కూడుకునేకర్మ ఏంపట్టె? అందుకనే బుర్రచెడిపోయింది, మెదడు పాడైపోయింది సరైన ఆలోచనలేక పిచ్చివాణ్ణి అయిపోయాను. ఒకసారి మాఆవిడతో అన్నాను మాటవరసకు "నాకు మతి చెడిపోయింది, పిచ్చివాణ్ణి అయిపోయాను" అని. చాలా తాపీగా సమాధానం చెప్పింది. "ఇప్పుడునాకు ఏడ్చేందుకు తీరికలేదు, తర్వాత తాపీగా ఏడుస్తాను" అని.

పిచ్చివాణ్ణయిన కారణంగా భోజనం సరిపడేదిగాదు. కాఫీ బాగాసరిపోయేది నా తత్వానికి. తినటం, తిరగటం రోజూ చేస్తున్న పనేగద! అందుకు భిన్నంగా ఏమైనా చేయగలిగితే చేయాలిఅని అనుకున్నాను చేయగలిగింది మాత్రం తిండితినక పేగులు ఎండబెట్టుకోవటం. అదొక్కటే చాలాకాలం సాధించగలిగాను.

ఆదివారం పూర్తిగా ఆలోచించాను. మరో తత్వానికి తావులేదు నామనస్సులో ఆరోజు. సోమవారం ఉదయానికల్లాఆలోచన తట్టింది. నా అసమర్థతనే కారణంతెలిసింది. ఇంతకాలంనుండీ జీవితంలో,బ్రతుకులో,ఉద్యోగంలోఎందుకురాణించలేకపొయ్యానో తెలిసింది. ఎందుకు? ఎందుకు? నామీదనాకు నమ్మకంలేదు. నేచేస్తున్న పనుల్లో నాకేనమ్మకంలేదు. నా ఆలోచనపైనాకేనమ్మకం. నన్ను నమ్మి నేను ఫలానిపనిచేశానా అని ఆలోచిస్తే ఏమీ అవుపించగు. ఇతరులమీద నమ్మకం మరి!నన్ను నేను నమ్మలేకపోవటం ఏరకం అవునా మరి?

మా ఆవిడ వంటపనిచేస్తోంది. తల చేత్తోబట్టుకుని పరుగెత్తాను. "ఏమిటా హడావిడి తలనొప్పా?" అన్నది.

"కాదు ఆలోచన వొచ్చింది విను" అన్నాను.

"తలపట్టుకోకపోతే ఆలోచన ఎక్కడకూ పోనుగాని తీరిగ్గా చెప్పండి" అన్నది.

పట్టు వొదిలినా ఆలోచన తలలోనే వున్నది ఆశ్చర్యం!

"ఇంతకాలం నన్ను నేనమ్మలేక పోయాను. ఇంక ముందు నేను నన్ను నమ్మాలి, తప్పదు" అన్నాను.

"మిమ్మల్ని చూస్తే భయం వేస్తోంది, ఇవాళ నిజంగాపిచ్చివారయ్యారు" ఆవిడను భయపెట్టటం నాకు సరదాకాదు, అసలు నామతంకాదు, కానప్పుడు ఆవిడ ఎందుకు భయపడాలి! న్యూసెన్సు పెళ్ళాలకి భయం ఎక్కువ.

అప్పుడే నిర్ణయించుకున్నాను, నిశ్చయించుకున్నాను కొత్త జీవితం ప్రారంభం కావడానికి. లోగడ బ్రతుకువేరు. నిరాశతో బ్రతికాను. నామీద నాకు నమ్మకంలేదు. అన్నిటా నిరాశా తాండవించేది యింతకాలమున్నా! అడుగడుగునా నిరాశ. ఏపని చెయ్యబోయినా నిరాశ, అనిశ్చయం... కాని నిన్న రేపుకాదు! రేపటి బ్రతుకువేరు. ఆశగా బ్రతకాలి. దేన్నో సాధించాలన్న ఆశ, ఆశయం వుండాలి. నామీదనాకు నమ్మకం ఏర్పడ్డది. ఏదో సాధిస్తాను. నేను సాధించలేనిదిలేదు లోకంలో. నాకు ఆ నమ్మకం వున్నది. కనక నాలో ఆశ కావాలి, నమ్మకం వుండాలి...

ఆఫీసుకు పోతున్నకొలదీ నాలో ఉత్సాహం ఎక్కువవుతోంది. ప్రతి విషయాన్నిగురించి నిర్దుష్టభావంకలుగుతోంది, ఆఫీసుకు అంతత్వరగా ఎప్పుడూ పోలేదు. నాజీవితంలో అంత ఉత్సాహంగానూ లేను ఎన్నడూ.

"పదినిమిషాలు ముందుగానే వొచ్చారే" అన్నాడు మానేజరు. రోజూ పదినిమిషాలన్నా ఆలశ్యంలేంది రానితను ముందురావటం ఆశ్చర్యం కాదుమరీ! అయినా నాలో వొచ్చిన మార్పు వాడికేం తెలుసు! అసలెందుకు తెలియాలి, తెలిసి ప్రయోజనం?

అంత సంతోషంతోనూ ఆ రోజు పనిజరుగుతోంది. నా జీవితంలో ఆ ఉదయం చేసినంత పని అంతకుముందు ఎన్నడూ చెయ్యలేదు. ఏదీ అసాధ్యంగా అవుపించలేదు. ఎప్పుడూ ఎదురు తిరిగే అకౌంట్సు ఆ రోజు అతితేలిగ్గా అర్ధం అయినాయి. ఉదయంనుండి సాయంత్రంవరకూ వ్రాయడం అవని ఉత్తరాలు అరగంటలో పూర్తిఅయినాయి. ప్రతి ఉత్తరంలోను కమ్మని భాష, కవిత్వంతో ఊగిసలాడింది. ఎవరి పని వారు చూచుకుంటున్నారు. నాతో మాట్లాడే తీరిక ఎవరికీ లేదు. ఆనందం పట్టలేక నాకు నేనే చెప్పుకున్నాను "ఆరే అబ్బాయి, ఇవ్వాళ ఆనందంగా ఉందికదూ! ఇలా గేవుండు గొప్పవాడివవుతావు."

నా సంగతంతా కొంతకాలంనుండి కనిపెడుతూనేవున్నాడు మానేజరు. నా అంత ఉత్సాహంగా ఆఫీసులో ఎవరూ పనిచెయ్యని మాట వాస్తవం. ఆ పరమసత్యం మానేజరుకి గూడా తెలిసింది.

"చాలా కష్టపడుతున్నావయ్యా" అన్నాడు.

"మా కష్టాన్ని గుర్తించే ప్రభువులున్నప్పుడు యింకా ఎక్కువ కష్టపట్టం కూడా సరదాగా వుంటుంది" అన్నాను.

"అట్లా బయటకు వెళదాంరా, మాట్లాడాలి" అన్నారు మానేజరు.

"ఈ ఒక్కవుత్తరం వ్రాసి వొస్తాను."

"తర్వాతవ్రాసుకోవచ్చు, తొందరలే" దన్నాడాయన.

"మొదలుపెట్టింతర్వాత చివరవరకూ ఆగకూడదు అన్నాడు నెపోలియన్. కనకనే ఆయన జయించగలిగాడు" అన్నాను.

ఉత్తరం పూర్తిచేసి మానేజరుతో బయటకు వెళ్ళాను.

ఇద్దరం హోటలుకేసి నడచాం. వొద్దని ఎంత బలవంతంచేసినా మా మానేజరు కాఫీ తాగక తప్పిందికాదు.

"మీతో ఒక చిన్న విషయం చెప్పాలని అనుకున్నాను. మీకన్న సమర్థులు నాకు మన ఆఫీసులో మరొకరు కనిపించలేదు. మీకు అభ్యంతరంలేకపోతే సంగతి ఒకసారి లక్నోదాకా వెళ్ళిరావాలి. సరుకు తీసుకుని బుక్ చేయించాలి.

"తప్పకండా పోతాను. మీ మాట కాదంటానా?" అన్నాడు.

"ఎప్పుడు బయల్దేరతారు."

"ఈ రాత్రికే... వెళ్ళగానే పని చూసుకుని వచ్చేస్తాను కూడా."

"మీరు వెళ్ళి గుర్జాలీలాల్ కంపెనీ మేనేజరు దగ్గర వుండండి. ఆయన సలహాప్రకారం వీలైతే చేయండి. ఆయన నాకు బాగా తెలుసు గుర్జాలీలాల్ జ్ఞాపకం వుంటుందా, కాగితంమీద వ్రాసుకోండి పోనీ"

"అవసరంలేదు"

వెంటనే ఇంటికి వెళ్ళిపోయ్యాను. రాత్రి బండికి ప్రయాణం కావాలి. లక్నో ఒంటరిగా పోవాలి అయినా నాకు నమ్మకంవుంది. వెళ్ళేపని పూర్తవుతుందా. ఆ నమ్మకం లేకపోతే ఒప్పుకునే వాణ్ణిగాను అసలు.

మా ఆవిడతో అన్నాను.

"నేను లక్నో వెడుతున్నాను"అని.

"ఎందుకు?"అన్నది.

"వ్యాపారం- సరుకు బుక్ చేసుకు రావాలి. చాలా పెద్దపని, పెద్దవాళ్ళతో పని, చాలా దూర దేశంలో పని. ఈ పని చేయగలిగేనా నేనూ గొప్పవాణ్ణవుతాను."

"అయినట్లేవుంది భోజనానికిలెండి."

ఆడాళ్ళతో వొచ్చేచిక్కే అది. ఏదీ నమ్మరు గదా?

ఆ రాత్రి బండికే బయల్దేరాను. నానా గడ్డి కరచి, లక్నో చేరుకున్నాను. సరాసరి, ఏకంగా గుర్జాలీలాల్ అండ్ కోకి వెళ్ళాను. అంతా నిశ్శబ్దంగావుంది. ఎవరూ వొద్దని అనలేదు. లోపలికి వెళ్ళిపోయాను.

ఫోనులో మేనేజరును పిలిచాను, "మీతో మాట్లాడాలి" అన్నాను;

"ఇప్పుడు వీల్లేదు" అని సమాధానం.

"కాదు. ఇప్పుడే చూడాలి... మీతో మాట్లాడాలి" అన్నాను.

"వీల్లేదయ్యా అంటుంటే" అని సమాధానం.

ఆ సాయంత్ర ఆయన యింటిదగ్గరకు వెళ్ళాను ఏకంగా. పేపరు చూస్తున్నాడు. "మీతో మాట్లాడొచ్చా?" అన్నాను.

"వీల్లేదు" అన్నాడు మామూలుగా. అదొక జబ్బేమోననుకున్నాను.

"నాకూ వీల్లేదా? రెండు వేల మైళ్ళదూరం నుంచి వొచ్చాను మిమ్మల్ని నమ్ముకుని, వీల్లేదంటే లాభంలేదు" అన్నాను.

ఆయన ఏమి సమాధానం చెప్పలేదు. ముభావంగా వూరుకున్నాడు. మళ్ళీ అందుకున్నాను, "మీరు చాలా గొప్పవారు... మంచివారు. నే మీదగ్గర చందాలకోసం రాలేదు. దానధర్మాలు చెయ్యమనిఅడగటంలేదు, కరువుఫండుకురాలేదు."

అప్పటికి తలెత్తి చూచాడు. ముష్టికోసమే వచ్చాననుకున్నాడు యింతసేపటినుంచి... మళ్ళీ అన్నాను, "వ్యాపారంకోసం వచ్చాను,"

దాంతో ఆయన స్నేహం లభించింది. నాకు కావలసిన సహాయం చేయక ఎలా తప్పుతుంది యిప్పుడు?

హాయిగా యింటికి బయల్దేరాను.

ఇంటికివెళ్ళేసరికి టేబిల్ మీద ఉత్తరం కవరు వుంది. ఏమిటాఅని తీసి చూచాను. అయిదువేల రూపాయలకు చెక్. కొత్తగా ప్రారంభించపోయే బ్రాంచికి మేనేజరు...లక్నోవ్యాపారంలో కమిషన్ అయిదువేలు వొచ్చాయి.

మా ఆవిడతో అన్నాను. "కొత్తబ్రాంచి మేనేజరు అయ్యాను" అని. "మీరా? చాల సంతోషం...అయితే నాకు నెక్ లెస్ ఎప్పుడు?"

"నాకు తీరికలేదిప్పుడు. చాలా పనులుచూచుకోవలసివుంది. మేనేజరుగా మోయవలసింది గాడిద బరువు" అన్నాను.

"మీరు మేనేజరు అయితే నాకేం, గవర్నరు అయితే నాకేం" అని మూతివిరుచుకు లోపలికి వెళ్ళిపోయింది మా ఆవిడ.

